# గ్రహణ సమయంలో పాటించే ఆచారాలు- ఆంతర్యాలు



గ్రహణం అంటే మనకు స్ఫురించేవి సూర్యగ్రహణం, చంద్రగ్రహణమే! సూర్యుడినీ, చంద్రుడినీ మనం ప్రత్యక్ష దైవాలుగా పూజిస్తున్నాం. అప్పటివరకూ ప్రకాశంగా కనిపిస్తున్న సూర్యుడు, చంద్రుడు హఠాత్తుగా కాంతివిహీనం కావడం ప్రారంభమై, కొద్దిసేపు అదృశ్యమై, తిరిగి ప్రకాశవంతంగా మారడాన్ని గ్రహణం అని మనం భావిస్తున్నాం. గ్రహణాలకు సైన్స్ చెప్పే కారణాలేమిటో మనకు తెలుసు. అయితే గ్రహణ సమయాలలో భారతీయులు అనేక ఆచారాలు పాటిస్తారు. నీటి పాత్రల పైనా, ఊరగాయల మీద దర్భలు వేయడం, గర్భిణీలను బయటకు రానివ్వక పోవడం, వారిని గ్రహణం చూడనివ్వక పోవడం ఇలాంటి ఆచారాలెన్నో పాటిస్తున్నాము. వీటిని మూఢనమ్మకాలుగా, అర్థం లేని ఆచారాలుగా భావిస్తున్నాము. ఇవి నిజంగా అర్థం లేని ఆచారాలేనా? గ్రహణ సమయంలో మనం పాటించే ఆచారాలు అర్థం లేనివి కాదు. అందులో సైన్స్‌తో ముడిపడిన అంశాలున్నాయని నేటి శాస్త్రవేత్తలు చెబుతున్నారు. గ్రహణ సమయంలో సూర్యుని కిరణాలు పడిన నీళ్ళలో స్వచ్ఛత తగ్గుతుందని, దానిపై దర్భలు వేయడం వల్ల స్వచ్ఛత కోల్పోవడమనేది ఉండదని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. గ్రహణ సమయంలో సూర్యుడు, చంద్రుడు, భూమి ఒకే సరళరేఖలోకి రావడం వల్ల మూడు గ్రహాల మధ్య పరస్పర ఆకర్షణ శక్తి స్వల్పంగా మారుతుందని, ఈ ఆకర్షణ శక్తి ప్రభావం ఆరుబయట సంచరించే గర్భిణీస్త్రీల గర్భస్థ శిశువుపై పడే అవకాశం ఉందని కూడా అంటారు. ఇలాంటివి వింటున్నప్పుడు మనకేమనిపిస్తుందీ? మన పూర్వులు పెట్టిన ఆచారాలలో ఎంతో కొంత అర్థం ఉందని అనిపించదూ?